

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శుక్రవారం,5 సెప్టెంబర్ 2025

8 పేజీలు




# లోకల్ వార్

- సన్నాహక షెడ్యూల్ విడుదల
- అన్ని పార్టీలకు ఇది పరీక్షే
- వచ్చే ఏడాది తొలుత పంచాయతీ సమరం
- ఆ తదుపరి జడ్పీటీసీ, ఎంపీటీపీ ఎన్నికలు

**ఏలూరు,సూర్యప్రతినిధి :** స్థానిక సమరం ఆరంభమైంది. పంచాయతీలు, ఆ తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా సన్నాహక షెడ్యూల్ విడులైంది.ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని తలపెట్టారు.దీనిలో భాగంగానే నగర పంచాయతీలు, మునిసిపల్, కార్పొరేషన్లకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఇక ఇప్పటి నుండే స్థానిక సమరం ఆరంభమైనట్టే. వాస్తవానికి స్థానిక సంస్థల ప్రతినిధులు ఎన్నికైన తరువాత వారి పదవీకాలం ముగియడానికి మూడు నెలలు ముందుగానే తిరిగి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇంతకుముందు వైసీపీ హయాంలో 2021లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండగా స్థానిక ఎన్నికల్లో దూకుడు ప్రదర్శించింది. ఇతర పార్టీల సానుభూతిపరులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చినా అడ్డుకోగలిగింది. గ్రామాల్లో వైసీపీ కేడర్ సైతం అన్ని పంచాయతీలు తమ పార్టీ సొంతం కావాలనే ధోరణిలోనే ఏకపక్షంగా వ్యవహరించారు.అప్పట్లోఈవ్యవహార శైలిని తెలుగుదేశంతో పాటు మిగతా పార్టీలు తప్పుపట్టాయి. ఏలూరు జిల్లా పరిధిలో సుమారు 567 పంచాయతీలు ఉండగావీటిలోఅత్యధికులువైసీపీ సానుభూతిపరులే గెలుపొందారు.సుమారు65మంది మాత్రమే వైసీపీయేతర సానుభూతి పరులు ఆనాడు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. కాని రానురాను ఎన్నికైన సర్పంచ్‌లు జీరోగా మిగిలారు. 14వ వార్థిక సంఘం నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం నేరుగానే దారిమళ్ళించింది. దీంతో స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో

- తరువాయి 2లో..

# అత్తిలి రైల్వే స్టేషన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

- ఈ నెలలోనే నర్సాపురం-చెన్నై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపుపై ప్రకటన
- జీఎస్టీ స్లాబులు తగ్గించడం చారిత్రాత్మక నిర్ణయం
- కలెక్టరేట్ నిర్మాణంపై అనవసర ఆందోళన వద్దు
- రాజకీయాలకు తావు లేదు
- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



**భీమవరం, మేజర్‌న్యూస్ :** నరసాపురం పార్లమెంట్ నియోజక వర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ జాతీయ రహదారుల నిర్మాణం, కొత్త రైల్వే ప్రాజెక్టుల సాధనపై దృష్టి సారించినట్లు కేంద్రఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరంలోని జిల్లా బిజెపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీఎస్టీ తగ్గింపు, విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తు పైన,వందే భారత్, అత్తిలిలో ఎక్స్ప్రెస్ రైళ్లకు హాల్ట్ సాధించడం, కలెక్టరేట్ నిర్మాణంపై కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జాతీయ రహదారుల నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయల నిధులు సాధించామని, 2,500 కోట్లతో చేపట్టాలనుకున్న ఎన్‌హెచ్ 165 వయా భీమవరం బైపాస్ రోడ్డు ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వచ్చాయని అయితే, రాష్ట్ర ప్రభుత్వం

- తరువాయి 2లో..

# నారా లోకేష్‌తో డా.దాసరి శ్యామ్ చంద్ర శేషు భేటీ

**అమరావతి/జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర విద్యా శాఖా మంత్రి,టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ను రాష్ట్ర అధికార ప్రతినిధి డా.దాసరి శ్యామ్‌చంద్ర శేషు గురువారం అమరావతిలో కలిశారు. ఈసందర్భంగా డిఎస్సి ద్వారా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా భర్తీ చేసి నిరుద్యోగ యువత భవితకు బంగారు బాట వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఏలూరు జిల్లా అధ్యక్ష పదవి విషయం తెలియజేశారు. కష్టపడ్డ వారికి తప్పకుండా మంచి అవకాశాలు వస్తాయని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ తెలిపారు. అతిత్వరలోనే కమిటీల నియామకం ఉంటుందని తెలిపారు.లోకేష్‌ను కలిసిన వారిలో చింతలపూడి మండల ప్రధానకార్యదర్శి కొండ్రు దేవా, శ్రీనివాసపురం సొసైటీ డైరెక్టర్ తాళ్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**చింతలపూడి,మేజర్‌న్యూస్ :** చింతలపూడి మండలం నరసింహపురం గ్రామానికి చెందిన మాదాసు సూరిబాబు (45)2ఎకరాల సొంత పొలం, ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట వేశాడు మొన్న కురిసిన వర్షాలకు పంట మొత్తం నీటిపాలైంది.దీంతో అతను అప్పులు ఎలా తీర్చాలని మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొదట అతను చింతలపూడి ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు చికిత్స పొందుతూ అతను గురువారం రాత్రి మృతిచెందాడు.

# ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన ఉమేష్ చంద్ర

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- రాష్ట్రాన్ని కదిలించిన ఉమేష్ చంద్ర మరణం : ఎంఎల్‌సి ఆలపాటి
- తెనాలిలో స్ఫూర్తి నింపేలా ఉమేష్ చంద్ర వర్ధంతి
- హాజరైన ఆయన భార్య ,ప.గో.జిల్లా కలెక్టర్ చదాలవాడ నాగరాణి







**తెనాలి/భీమవరం,మేజర్‌న్యూస్ :** ప్రజల కోసం ప్రాణం ధారపోసిన పోలీస్ అధికారిగా ఉమేష్ చంద్రను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువరని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.నిజాయితీ,ధైర్యం, ప్రజాసేవ ఆయన మనకు అందించిన వారసత్వం వంటివని కొనియాడారు. దివంగత ఐపిఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 26వ వర్ధంతి కార్యక్రమం గురువారం తెనాలి చెంచు పేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన

- తరువాయి 2లో..

# చారిత్రాత్మక నరసాపురానికి ప్రాధాన్యత నివ్వండి

- మంత్రులను కోరిన అఖిలపక్ష నేతలు





**అమరావతి/నరసాపురం,మేజర్‌న్యూస్ :** బ్రిటిష్ కాలం నుండి పార్లమెంట్ కేంద్రంగా,డివిజన్ కేంద్రంగా కొనసాగుతూ ఎన్నో చారిత్రక కట్టడాలు కలిగివున్న నర్సాపురానికి ప్రాధాన్యతనిచ్చి జిల్లా కేంద్రం చేయాలని ఈప్రాంతానికి చెందిన అఖిలపక్షం నేతలు గురువారం మంత్రులను కోరారు. జిల్లాల విభజనలో జిల్లాకేంద్రంగా ఉండవలసిన నరసాపురంకు అప్పటి వైసిపి ప్రభుత్వం అన్యాయం

- తరువాయి 2లో..

# లోకల్ వార్

మొదటిపేజి తరువాయి

పంచాయతీల్లో అస్తవ్యస్త వైఖరి నెలకొంది. ఆర్థిక సంఘం నిధులను కేవలం విద్యుత్ చార్జీల బకాయిల నిమిత్తం మళ్ళించడం ఎంతవరకు సబబంటూ అప్పట్లో ఆ పార్టీ సానుభూతిపరులైన సర్పంచ్‌లే తీవ్రంగా అసంతృప్తి చెందారు. గడిచిన ఐదేళ్ళల్లో సర్పంచ్‌లు పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలోనే గ్రామ పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగాఏర్పాట్లు చేయాల్సిందిగా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు ముందస్తు ఏర్పాట్లు ఏఏ రూపంలో వ్యవహరించాలో కూడా స్పష్టంగా పేర్కొంది. వాస్తవానికి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైసీపీ సానుభూతిపరులైన కొందరు సర్పంచ్‌లు గోడ దూకేందుకు సిద్ధమైనా చాలా చోట్ల స్థానిక కూటమి నాయకత్వం అడ్డు తగిలింది. అధికారంలో ఉండగా నువ్వానేనా అనే విధంగా కత్తులు దూసుకున్నాం కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ అనుకూలురును పార్టీలో చేర్చుకోరాదంటూ టీడీపీ అధినాయకత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చారు. దీంతో వైసీపీ నుంచి వలసలకు కట్టడి పడినట్టయ్యింది. అయితే ఈసారి జరగబోయే స్థానిక సమరంలో కూటమి పక్షాన టీడీపీతో పాటు బిజెపి, జనసేన కూడా గత ఎన్నికల్లో నామినేటెడ్ పోస్టుల్లో కూర్పు నేపథ్యంలో జరిగిన దామాషా ప్రకారమే ఉండగలదని ఇప్పటికే అంచనా వేస్తున్నారు. అలాగే వైసీపీ కూడా ఈ ఎన్నికల్లో నేరుగా బాహాబాహీకి దిగే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి.

– **పట్టణాల్లోనూ ఫైట్** – ఒక్క పంచాయతీలే కాదు నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకుఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు. 2021లోనే మూడు విడతలుగా నగర పంచాయతీలు, కార్పొరేషన్, మునిసిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి పశ్చిమలోని మునిసిపాలిటీలు, ఏలూరు కార్పొరేషన్ కూడా అప్పట్లో తొలి విడతలోనే ఎన్నికలు జరిగాయి. ఈనేపథ్యంలో పట్టణాల్లోను పెద్ద ఎత్తున హోరాహోరీ యుద్ధం సాగనుంది. ఇప్పటికే మునిసిపాలిటీ, నగర పంచాయతీల్లో అత్యధికం వైసీపీ ఆధీనంలోనే ఉన్నాయి. అప్పట్లో ఏలూరు కార్పొరేషన్‌తో సహా తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, నరసాపురం, భీమవరం, జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ ఆసాంతం వైసీపీ అభ్యర్థులే ఏకపక్షంగా గెలిచారు. ఏలూరు మేయర్ నూర్జహాన్ మాత్రం టీడీపీలో చేరారు. ఆమెతోపాటు మరికొంతమంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేన వైపు మొగ్గుచూపారు. అయితే స్థానిక సంస్థలకు సంబంధించి అంతా వైసీపీ ప్రతినిధులే ఉండగా గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ రెండు జిల్లాల పరిధిలోని కూటమి ఎమ్మెల్యేలే స్వీప్ చేశారు. దీంతో త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయి కాబట్టి తొలి ఏడాది పాలనలో కూడా ఎక్కడా వలసలను ప్రోత్సహించలేదు. స్థానిక ఎమ్మెల్యేలు కూడా ఇతర పార్టీలకు చెందిన వారిని పార్టీలో చేర్చుకోవడానికి తీవ్రంగా వ్యతిరేకించారు. దీనికితోడు ఈసారి ఆకివీడు, చింతలపూడి వంటి నగర పంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి.

జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు కూడా.. వచ్చే ఏడాదే జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించాలని తలపెట్టారు. సాధ్యమైనంత మేర స్థానిక సంస్థలన్నింటికీ వరుసగా ఎన్నికలు నిర్వహించే ప్రక్రియలో భాగంగానే సన్నాహక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా పరిషత్‌లో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వైసీపీకి రాజీనామా చేసి ఈ మధ్యనే టీడీపీలో చేరారు. జిల్లా పరిషత్‌లో 48 జడ్పీటీసీలకు గాను ఇద్దరు మినహా మిగతా వారంతా అప్పట్లో వైసీపీ పక్షాన గెలిచినవారే. జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీతో పాటు మరికొంత మంది ఎంపీటీసీలు టీడీపీలోకి జంప్ చేయాలనుకున్నా పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. అయినా కొంతమంది ఇప్పటికే తమ నియోజకవర్గ ఎమ్మెల్యేలతో మాత్రం సన్నిహితంగానే ఉంటున్నారు. అలాగే ఉమ్మడి పశ్చిమగోదావరిలో 876 మంది ఎంపీటీసీలు ఉండగా అప్పట్లో వీరిలో 65 మంది మినహా మిగతా వారంతా వైసీపీ పక్షాన గెలిపొందినవారే. దీంతో ఎంపీపీ స్థానాలన్నీ అప్పట్లో వైసీపీకే దక్కాయి. ఇప్పుడు ఈ స్థానాలన్నింటికీ ఎన్నికలు నిర్వహించాలని తలపెట్టడం అన్ని పార్టీలకు అగ్ని పరీక్షే కానుంది.

## ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** విద్యార్థులు ఉపాధ్యాయుల అవతారం ఎత్తి పాఠాలు బోధించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని రెడ్డి గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వినూత్న రీతిలో ఒకరోజు ఉపాధ్యాయ అవతారం ఎత్తారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారో అదేవిధంగా క్లాసులో విద్యార్థులు బోధించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు చెప్పిన పాఠాలు ఎంతో ఆసక్తిగా సంతోషంగా ఉన్నాయనిపాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## పాము కాటుకు గురై వ్యక్తి మృతి



**ద్వారక తిరుమల, మేజర్ న్యూస్ :** ద్వారకతిరుమల మండలం సూర్య చంద్ర రావు పేటకు చెందిన అశోక్ (23) అనే యువకుడు స్థానికంగా పొలం పనులు చేస్తూ తల్లి దండ్రులతో కలిసి జీవిస్తున్నాడు అతనికివివాహంకాలేదు. బుధవారం పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యా డు. బంధువులు అతని భీమడోలు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు ధృవీకరించారు.

## అత్తిలి రైల్వే స్టేషన్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

మొదటిపేజి తరువాయి

సీఎస్ఆర్ రేట్లు పెంచడంతో ప్రాజెక్టు వ్యయం రూ.3,200 కోట్లకు పెరిగిందని,అదనంగా పెరిగిన రూ.700 కోట్లకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా అంగీకరించారని శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం 3200 కోట్లతో డిపిఆర్ కూడా సిద్ధమైంది అన్నారు.

**ఈ నెలలోనే నర్సాపురం - చెన్నై వందే భారత్ -** చెన్నై–విజయవాడ వందే భారత్ రైలును నరసాపురం వరకు పొడిగించాలని రైల్వే మంత్రిని, రైల్వే ఉన్నతాధికారులను కలిసి పలుమాలు చర్చించడం జరిగిందన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఆలస్యమైనప్పటికీ, అన్ని సమస్యలను పరిష్కరించామని, ఈ నెలలోనే నరసాపురం నుంచి చెన్నై వరకు వందే భారత్ రైలు పొడిగింపుపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు.

– **అత్తిలి రైల్వే స్టేషన్ లో రెండు ఎక్స్‌ప్రెస్ లకు హాల్ట్** –అత్తిలి రైల్వే స్టేషన్‌లో కరోనా మహమ్మారి తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారని,వారికి ఇచ్చిన హామీ మేరకు తాను రైల్వే ఉన్నతాధికారులతో చర్చించానని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. తన విజ్ఞప్తికి స్పందించిన రైల్వే శాఖ అధికారులు పూరీ–తిరుపతి మరియు కాకినాడ–చెన్నై సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లు అత్తిలిలో హాల్ట్ ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారని, రెండు రోజుల్లో ఈ విషయంపై ఉత్తర్వులు విడుదల అవుతాయని ఆయన వెల్లడించారు. నరసాపురం–అరుణాచలం వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలును మరో నెల పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారని,ఈ రైలును రెగ్యులర్ రైలుగా మార్చాలని తాను చేసిన విజ్ఞప్తికి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. జీఎస్టీ అమలులో మార్పులు, సంస్కరణలు తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లుగానే,జీఎస్టీ కౌన్సిల్ స్లాబులను తగ్గించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అన్నారు.

– **విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుకు భరోసా** – విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నష్టాల నుండి లాభాల బాట పట్టించేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నామని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని ఆయన హితవు పలికారు.

– **కలెక్టరేట్ నిర్మాణంపై స్పష్టత** –కలెక్టరేట్ అనేది ప్రజల పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ అని, అది ఎక్కడ నిర్మిస్తారనే అనవసరమైన ఆందోళన అవసరం లేదని కేంద్ర శ్రీనివాస వర్మ అన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు అనువుగా ఉండే ప్రాంతంలో,విశాలమైన పార్కింగ్ స్థలం,అన్ని శాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. కలెక్టరేట్ నిర్మాణ విషయంలో రాజకీయాలకు,ప్రతిష్టకు తావు లేదని, రాజకీయపరమైన అభిప్రాయాలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన ఉమేష్ చంద్ర

మొదటిపేజి తరువాయి

మనోహర్ మాట్లాడుతూ ప్రజాసేవే పరమ ధర్మమని చదలవాడ జీవితం చాటి చెప్పిందని,ఆయన చరిత్ర నేటి పోలీస్ అధికారులకు, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ధైర్యానికి పర్యాయపదంగా అరాచక శక్తులను అణిచివేసార న్నారు .ఫ్యాక్షన్ గడప కడపలో ప్రజల మనిషిగా గుర్తింపు పొందగలి గారన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ఆయుధం లేకుండా సాయిధ నక్సలైట్లకు ఎదురు వెళ్లటం ఉమేష్ చంద్ర ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. అఖరి శ్వాస వరకు తన పోరాటం ఆపలేదన్నారు. ఉమేష్ చంద్ర సతీమణి, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నిజాయితీ పరుడైన ఒక పోలీసుఅధికారిని ప్రజలు ఎప్పటికీ గుర్తు ఉంచుకుంటార నటానికి ఈ వర్ధంతి కార్యక్రమమే నిదర్శనమన్నారు. స్వచ్ఛంధంగా నివాళులు అర్పించేందుకు తరలి వచ్చిన ప్రజలకు చదలవాడ కుటుంబీకురాలిగా కృతజ్ఞతలు తెలుపు తున్నానన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ మాట్లాడుతూ తన తండ్రి నుండి దివంగత ఉమేష్ చంద్ర గురించి తెలుసుకుని, ప్రేరణ పొందానన్నారు. తొలుత తెనాలి డిఎస్పి జనార్ధన్ ,నాదెండ్ల, ఆలపాటి, చదలవాడ తదితరులు ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చిన్నారులు నుండి గౌరవ వందనం స్వీకరించారు. సభాకార్యక్రమం తదుపరి కలెక్టర్ నాగరాణి నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసారు. పుర ప్రముఖులు,పోలీసు సిబ్బంది ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో చదలవాడ కుటుంబీకులు భుజంగరావు,క్రాంతి, ఉమామహేశ్వరరావు, సాంకేతిక విద్యా శాఖ అధికారులు,కోస్తా జిల్లాల ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. చదలవాడ కుటుంబీకుల భావోద్వేగాలు ,అభిమానులు, స్థానిక విద్యావేత్తల ప్రసంగాలు, పలకరింపులు అక్కడి వాతావరణాన్ని మరింత గంభీరంగా, హృద్యంగా మార్చాయి.

## చారిత్రాత్మక నరసాపురానికి ప్రాధాన్యత నివ్వండి

మొదటిపేజి తరువాయి

చేసిందని, ఇప్పటికే వెనకబడిన ఈ ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేసి ఆదుకోవాలనికోరారు. సువిశాలమైన భూభాగం, ప్రభుత్వ భవనాలు జిల్లా కేంద్రానికి కావలసిన అన్ని హంగులు ఉన్నాయనివారు తెలిపారు. భీమవరంలోని జిల్లా కార్యాలయాలన్నీ అద్దె భవనాలలో కొనసాగు తున్నాయని,నరసాపురాని జిల్లా కేంద్రంగా చేస్తే ప్రభుత్వ భవనాలే వాడుకోవచ్చునని వారుతెలిపారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, సత్య ప్రసాద్ తదితరులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు,తెలుగుదేశం పార్టీఇంచార్జ్ పొత్తూరి రామరాజు,డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ తదితరుల నాయకత్వంలో పెద్ద ఎత్తున అఖిలపక్షం నేతలు అమరావతి వెళ్లారు. ఈ సందర్భంగా తాము అందజేసిన వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లి నరసాపురంకి న్యాయం చేయాలను కోరారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి సుబ్బారావు, కోనపరెడ్డి రంగారావు,మైలా వసంతరావు, సిరిగినీడి రాజ్యలక్ష్మి,డాక్టర్ ప్రకాష్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, నడిపూడి కృష్ణ, పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ వినాయకున్ని దర్శించుకున్న మాజీ మంత్రి కొత్తపల్లి



**హైదరాబాద్, నరసాపురం, మేజర్‌న్యూస్ :** హైదరాబాద్ నగరంలోని ఖైరతాబాద్ వినాయకుడిని మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో కొత్తపల్లి కి స్వాగతం పలికి శా లువతో సత్కరించారు.

# పోలవరం నిర్వాసితుల భూసేకరణలో చెప్పేదొకటి - జరిగేది మరొకటి

**– అధికారులలపై సిపిఎం జిల్లా కమీటి విమర్శలు**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న భూ సేకరణలో జిల్లా అధికారులు చేస్తున్న ప్రకటనలకు, మాటలకు అక్కడ జరుగుతున్న దానికి అసలు పొంతనే లేదని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ .రవి ఇదే అంశంపై మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల కోసం చేస్తున్న భూ సేకరణలో అధికారులు చెప్పేది ఒకటి – అక్కడ జరిగేది మరొకటి అని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఇంతకుముందే భూసేకరణ చేశామని, మిగులు భూములు ఉన్నాయని ప్రకటించిన అధికారులు వాటి లెక్కలు, వివరాలు తెలపలేదని, అప్పుడే ఆ భూ సేకరణ సందర్భంగా అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఇప్పుడు తిరిగి మరొక ఎనిమిది వేల ఎకరాలు భూసేకరణ కోసం ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అవసరమగు భూములు సేకరించాలని, వారికి భూమికి భూమి ఇవ్వాలని, కాలనీలు నిర్మించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం పార్టీ కూడా పోరాడుతుందని స్పష్టం చేశారు. అయితే ఏజెన్సీ ప్రాంతం 1/70 చట్టం ఉన్న ప్రాంతమని, షెడ్యూల్ ప్రాంతమని, రాష్ట్రపతి,గవర్నర్ ఆదేశాలలో ఉండాల్సిన ప్రాంతమని, గవర్నమెంట్, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఉండాల్సిన ప్రాంతమని తెలిపారు. ఈ ప్రాంతంలో భూసేకరణ చేస్తే గ్రామ సభలు పారదర్శకంగా జరిపి, గిరిజనేతర భూస్వాములు భూములను సేకరిస్తే ఏజెన్సీ ప్రాంతంలో భూ సమస్య ఉండదని రవి స్పష్టం చేశారు. గిరిజనుల సాగులో ఉన్న భూములు గాని, కోర్టు వివాదాల్లో ఉన్న భూములు గాని సేకరించమని, గిరిజనేతరుల భూములను మాత్రమే సేకరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ చేసిన ప్రకటనను ఆయన స్వాగతించారు.వాస్తవానికి ఇవి ప్రకటనలు గానే మిగిలిపోతున్నాయని ,ఏజెన్సీలో జరుగుతున్నది మరొకటని అన్నారు.గిరిజనుల హక్కులు కాపాడాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని లేని పక్షంలో సిపిఎం పార్టీగా గవర్నర్ తో పాటు రాష్ట్రపతి దృష్టికి కూడా ఏజెన్సీలో జరుగుతున్న వ్యవహారాలను తీసుకువెళతామని హెచ్చరించారు.

# పార్టీని మరింత బలోపేతం చేయాలి : ఎంపీపీ మైలబత్తుల సో నీ



నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలలోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంపీపీ మైలబత్తుల సోనీ అన్నారు. గురువారం మండలంలోని లిఖితపూడి గ్రామంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన వాగ్దానాలు అమలు కావటం లేదన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యలపై అధికారులకు తెలియజేయాలని ఆయన అన్నారు. వైసిపి కేంద్ర పాలక మండల్ సభ్యులు పిడి రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉన్నదని గెలుపు ఓటములు రాజకీయాలలో సహజమన్నారు. పార్టీ క్యాడర్ చెక్కుచెదర కుండా వారికి వచ్చే సమస్యలపై సహకారం అందించాలన్నారు. అనంతరం పితాని మురళి అధ్యక్షులుగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చినమిల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారంలో నష్టం రావడంతో వ్యక్తి ఆత్మహత్య

కలిదిండి ,మేజర్న్యూస్ : కలిదిండి మండలం ఆవుకుదురు గ్రామానికి చెందిన కాట్రగడ్డ నరసింహస్వామి(40)అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన స్వీట్ల వ్యాపారం చేస్తూ భార్యా పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వ్యాపారంలో ఆర్థికంగా సమస్యలు తలెత్తడంతో మనస్థాపం చెందిన అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఏలూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు.

# రైలు ఢీకొని బాలుడు మృతి



**పెదపాడు,మేజర్ న్యూస్ :** ఇంటి పక్కనే ఉన్న రైలు పట్టాలు దాటుతున్న మైనర్ బాలుడిని రైలు ఢీకొనడంతో అతను ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ సమీపంలోని నూజివీడు రైల్వే స్టేషన్ వద్ద గురువారం చోటు చేసుకుంది. మృతుడు పెద పాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన సిరిగిరి సాయి తేజ (16)గా గుర్తిం చారు రైల్వే హెచ్ సి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్ర ప్రజలందరిపై వినాయకుడి ఆశీస్సులు ఉండాలి

**– అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్ అప్పల నాయుడు**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరులో పలు డివిజన్‌లో వినాయక చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా గురువారం 5వ డివిజన్ చెంచుల కాలనీలో,3వ డివిజన్ సత్యనారాయణ పేటలో, 6వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2లో,35 వ డివిజన్ బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. తొలుత శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పెద్ద ఎత్తున వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ వేలాది మందితో అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్న చెంచుల కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. సర్వవిఘ్నాలను తొలగించే లోక పూజితుడైన ఆ గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,సమిష్టిగా ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించి అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన క్లస్టర్ ఇంచార్జ్‌లు రెడ్డి గౌరీ శంకర్,ఎట్రించి ధర్మేంద్ర, 5వ డివిజన్ శ్రీ లక్ష్మీ గణపతి కమిటీ సభ్యులు మంగం శివ, బత్తుల సాయి కుమార్,గుదె జగదీష్,రెడ్డి చంద్రమౌళి, రెడ్డి బలరాం, రెడ్డి మనోజ్, బత్తుల ప్రసన్న కుమార్, 3 వ డివిజన్ కమిటీ సభ్యులు నడిపూడి ఈశ్వర్ రావు, లొట్టి రాజు, రామ్ ప్రసాద్, దుర్గా ప్రసాద్, సాయి, చందు మరియు 6 వ డివిజన్ శ్రీ బాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంఘ సేవకులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కళాశాల ప్రణాళిక ,అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రణాళిక ,అభివృద్ధి మండలి కార్యదర్శి ఇరదల రఘుబాబు,సభ్యులు ఎల్ వెంకటేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఉపాధ్యాయుడు విద్యార్థులకు కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతాడని అన్నారు. సిపిడిసి సభ్యులు ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.అనంతరం కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె అజయ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎం రాంబాబు,వి వెంకట్రావు,కె రమేష్ ,టీవీఎస్ పద్మావతి,డాక్టర్ ఎం విజయకుమార్,ఎస్ పరమేశ, ఎం కృష్ణ చైతన్య,టి వెంకట దుర్గాప్రసాద్,పిఆర్ కావ్య శ్రీ,ఎస్ సుస్యలత,డి సుజాత,జె మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పంపిణీ వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మార్పించుకోవాలి

**ఏలూరు,మేజర్న్యూస్ :** ప్రజా పంపిణీ వ్యవస్థలో పౌర సరఫరాల శాఖ వినియోగించిన ఎండియు వాహనాలను పౌరసరఫరాలశాఖ నుండి తొలగించిన నేపథ్యంలో వాటి క్లాస్ అఫ్ వెహికల్‌ను రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో మార్పించుకోవాలని జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 ఎండి యు వాహనాలు ఉన్నాయి అని వాటిని వాటి యజమానులు వాటి క్లాస్ అఫ్ వెహికల్ను మొబైల్ కాంటీన్ నుండి గూడ్స్ క్యారేజ్ కు మార్చుకోవాలని గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

# స్వచ్ఛమైన మంచి నీటిని అందించాలి

**– చించినాడ పంచాయతీని ముట్టడించి ధర్నా చేసిన ప్రజలు**





**యలమంచిలి, మేజర్ న్యూస్:** స్వచ్ఛమైన మంచి నీటిని అందించాలను కోరుతూ మండలంలోని చించినాడ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, గ్రామ ప్రజలు పంచాయితీ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ కులాయి ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు పూర్తిగా కొలుషితమైందన్నారు. తాగడానికే కాకుండా స్నానాలు చేయడానికి ఇంట్లో వాడకానికి కూడా ఆ నీరు ఉపయోగకరంగా లేదన్నారు. గతంలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర మహానేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్. ఎస్),సూర్యనారాయణ రాజు, కేతా సూర్యరావు, పెచ్చేటి సత్యనారాయణమ్మ సర్పంచ్ లుగా పని చేసిన హయాంలో ఇటువంటి కలుషిత నీటి దుస్థితి ఎన్నడూ రాలేదన్నారు. ఒకవారంలో మంచినీటి సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సర్పంచ్ రావాలంటూ తమగోడు వినాలంటూ ప్రజలంతాపెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సర్పంచ్ కి పంచాయతీ కార్యదర్శి ఫోన్ చేశారు. అయితే ఆమె ఎటువంటి సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేయడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.అనంతరం కార్యదర్శి హరిప్రసాద్‌కు వినతిపత్రంఅందజేశారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు తెన్నేటి. స్టాలిన్,మురాల రాజేష్,కటకం శెట్టి బాలాజీ నాయుడు సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్,విప్పర్తిరమేష్,యుటిఎఫ్‌రాష్ట్ర నాయకులు ఎస్. జయప్రభ, ఐద్వా నాయకులు ఎం.జయశ్రీ, ఎస్‌నాగమణి, టి.వెంకట లక్ష్మి తదితరులు, మహిళలు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యం





**– కేంద్ర మంత్రి వర్మ ,ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**

**కొయ్యలగూడెం,రూరల్ మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి నోచుకోవడం ఎంతో సంతోషంగా ఉన్నదని , గ్రామ అభివృద్ధికి కూటమి తరపున సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు పట్టణాలకు పల్లెటూర్లు పట్టుకొమ్మలని సంక్షేమం అభివృద్ధి చెందా పరుగులు తీస్తున్నా యని పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు తెలిపారు.

మండల కేంద్రంలో పొంగుటూరు గ్రామ శివారు నూతనంగా ఏర్పాటు చేసిన గ్రీన్ ఫీల్డ్ హైవే ఫ్లైఓవర్‌ను అనుకొని సాయి రాకేష్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్. ఆర్.ఆర్ నరసింహారాజు, కేశవలచే నిర్మించిన (సియా) భారత్ ఫీలింగ్ పెట్రోల్ బంక్‌ను గురువారం కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మతో కలిసి బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి,శాసనసభ్యులు మాట్లా డుతూ అప్లాండ్ ఏరియాలో పామాయిల్ టొబాకో వరి మొక్కజొన్న పంటలు పండించే రైతులకు ఈ ఫిల్లింగ్ అద్భుతంగా ఉపయోగప డుతుందని, చిన్న వాహనదారులకు కూడా, హైవే వెంబడి ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు.నాణ్యత ప్రమాణాలతో కూడిన పెట్రోల్, డీజిల్‌ను ప్రజలకు అందించాలని బంక్ యాజమా న్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు, ఎస్ఆర్ఆర్పి సుభద్ర దేవి,కూటమి పార్టీల నాయకులు అత్యధికంగా పాల్గొన్నారు.

## జిల్లాలో ఎరువుల కొరత లేదు, సొసైటీలలో లభ్యం - రైతులు ఆందోళన చెందనవసరం లేదు

**– జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**



**వీరవాసరం,మేజర్ న్యూస్ :**వీరవాసరంలో శ్రీనివాస ట్రేడర్స్, సాయి లక్ష్మి ఫెర్టిలైజర్స్, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు సంబంధించిన గోడౌన్లు గురు వారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. యూరియా నిల్వలను సంబం ధించిన స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎరువులు కొరత లేదు సరిపడనంత నిల్వలు సొసైటీలో అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. రైతులతో మాట్లాడారు రైతులు ఎవరు ఆందోళన చందవద్దని పిఏసిఎస్ లలో అవసరమైన యూరియా అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. గత సార్వ పంటలో ఎంత యూరియా అయితే అవసరమైనదో ప్రస్తుతం కూడా అంతే నిల్వలు ఉంచడం జరిగిందని అన్నారు. బయట వదంతులను నమ్మి రైతులెవరు ఆందోళన చెందవద్దని చెప్పారు. ఎవరైనా ఎరువుల అమ్మకాలలో ప్రభుత్వ నియమాలను పాటించకుండా ఉంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, తాహసిల్దార్, రామాంజనేయులు, మండల వ్యవసాయ శాఖ అధికారి బిస్సీ బాబు, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లూథరన్ చర్చ్ ఏరియాలో సిసి డ్రైనేజ్ నిర్మాణం



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** పెనుమంట్ర లూథరన్ చర్చ్ ఏరియాలో పంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి, సిసి డ్రైనేజ్ ను నిర్మాణాన్ని ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచ్ భూపతి రాజు శ్రీనివాసరాజు అన్నారు, ఈ సందర్భంగా సర్పంచ్ ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణభివృద్ధిలో భాగంగా మౌళిక వసతుల కల్పనలో హైస్కూల్, చర్చ్ కాంపౌండ్ చుట్టూ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు, ఈ కార్యక్రమం లో లూథరన్ చర్చ్ ప్యారిస్ పాస్టర్ రెవరెండ్,దాసి రాజారత్నం,సి ఆర్ దుండి నాగేశ్వరావు, వార్డు సభ్యులు చలమల దుర్గ, ఉనికిలి సి ఆర్ దాయం రత్నరాజు,సంఘ పెద్ద జాలెం చందర్రావు,గ్రామ నాయకులు జోగి వెంక టేశు, మైలాబత్తుల రవీంద్ర ప్రసాద్, నేలపాటి చంటి,చిన్న బ్బాయి,జాలెం వెంకటేశులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంఘస్తులు పాల్గొన్నారు.

# చేనేత కార్మిక సంఘ మహాసభను జయప్రదం చేయండి

**– జిల్లా కన్వీనర్ బూడిద జోగేశ్వరరావు**



**నరసాపురం,మేజర్‌న్యూస్:**ఈనెల 8నదగ్గులూరులో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ బూడిద జోగేశ్వరరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం స్దానిక ముద్దాల వారివీధిలోటి. శ్రీనూవాసరావు అధ్యక్షతన గురువారంజరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బూడిద జోగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత రెండో ప్రాధా న్యత కలిగిన రంగం చేనేత రంగం మానవ సమాజానికి నాగరికత నేర్పిన చేనేత కార్మికులు నేడు పాలకులుఅవలంభిస్తున కర్పోరేట్వి ధానాలవలన చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడి ఆకలి చావులు ఆత్మహత్యలులకు బలవుతున్నారుఅని నమ్ముకున్నవృత్తిని వదులుకోలేక మరో వృత్తిలోక ి వెళ్లలేక జీవశ్చవంలాబ్రతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చేనేత పై జిఎస్టి వేసి చేనేతను ధ్వంసం చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు కచ్చితంగా చేనేత వస్త్రాలనే యూనిఫామ్ గా వాడేటట్టు చర్యలు తీసుకొని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించి పరిశ్రమను కాపాడాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి చేనేత కార్మికునికి నేతన్ననేస్తం అమలు చేయాలని అనేక చేనేత కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటంలో తెలుగు నాడు చేనేత కార్మిక సంఘం కూడా కలిసి పోరాడిందని ఆయన గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే చేనేతను కాపాడుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన మాట నిలబెట్టుకోక పోగా గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని పూర్తిగా నిలిపి వేసిందని ఆయన విమర్శించారు. నేతన్న నేస్తం వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుడిమెట్లసుబ్బారావు, బొప్పే శంకర్ రావు, వాసా రామలింగం,అక్కింశెట్టి కోట నాగయ్య, కాసా కోటేశ్వరరావుఅందేశ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి జీవితంలో గురువుల బాధ్యత మరువలేనిది






**ఏలూరు,మేజర్ న్యూస్ :** విద్యార్థి జీవితంలో గురువుల బాధ్యత మరువలేనిదని, వారి ప్రభావంతో వెలుగులు నిండుతాయని మదర్ ఎర్నెస్టిన్ ఫెర్నాండిస్ అన్నారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో జరిగిన గురుపూజోత్సవ వేడుకలలో కళాశాల సుపీరియర్ అండ్ కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టిన్ ఫెర్నాన్ డేస్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాలలో మూడున్నర దశాబ్దాలు ఎన్‌సిసి ఆఫీసర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన మేజర్ డాక్టర్ పిఎం సెలీన్ రోజీని, కళాశాలలో అధ్యాపక వృత్తిలో రెండున్నర దశాబ్దాలు పని చేసిన రసాయన శాస్త్ర శాస్త్ర వృక్ష శాస్త్ర విభాగాలకు చెందిన డాక్టర్ గాయత్రి డాక్టర్ కెఎస్‌వికె ఎస్ మాధవి రాణి డాక్టర్ బిబిఆర్‌జి విజయ లక్ష్మి రజతోత్సవ వేడుకలను కళాశాల యాజమాన్యం అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినులు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో చీకటిని తొలగించి వెలుగు నింపి ప్రేమ ఆప్యాయతలకు చిహ్నంగా నిలిచే గురువు విద్యార్థుల కళలను నిజం చేసే ప్రత్యక్ష దైవం అన్నారు. తమ కళాశాలలో దశాబ్దాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న అధ్యాపకులను ఈ విధంగా గౌరవించడం సన్మానించడం తమ బాధ్యత అన్నారు.ఈ అధ్యాపకులను కళాశాల సిబ్బంది,విద్యార్థినులు సత్కరించి గౌరవించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

## ఆక్వా యూనివర్సిటీకి శాశ్వత భవనాలు నిర్మించాలి : సిపిఎం పెద్దిరాజు




**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్:** రెండేళ్ల క్రితం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆక్వా యూనివర్సిటీకి ఇప్పటి వరకు సొంత భవనాలు, క్యాంపస్ ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు విమర్శించారు.గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆక్వా యూనివర్సిటీ విద్యార్థులకు ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న లక్ష్మణేశ్వరం తుఫాన్ రక్షిత భవనం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థులకు తుఫాను షెల్టర్లో క్లాసులు నిర్వహించటం సరైన పద్ధతి కాదని అని అన్నారు.ఇరుకు గదుల్లో విద్యాబోధన, హాస్టల్ వసతి లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఆక్వా యూనివర్సిటీ కోసం ప్రభుత్వం కేటాయించిన 50ఎకరాల స్థలంలో శాశ్వత భవనాలు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నర్సాపురం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు,తెలగం శెట్టి సత్యనారాయణ,గుబ్బల నాగేశ్వరరావు,బొక్క శ్రీనివాసరావు,బాలం నాగభూషణం, కవురు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన విప్ నాయకర్



**మొగల్తూరు,మేజర్ న్యూస్ :** ప్రభుత్వ విప్, నరసా పురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పంచాయతీ రాజ్ (ప్రాజెక్ట్స్) ద్వారా రూ.9 కోట్లు వ్యయంతో మొగల్తూరు నుండి కొప్పర్రు వరకు శేరేపాలెం మీదుగా నిర్మించబోయే బి టీ రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మొగల్తూరు మండలంలోని నీటితిప్ప జగన్నాథపురం గ్రామాలలో సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు,కొల్లాటి గోపికృష్ణ, గుబ్బల నాగరాజు,మైల వసంతరావు,వలవల నాని,నిప్పులేటి తారకరామా రావు, వాతాడి కనకరాజు,పులపర్తి సూర్యనారాయణ, పాల రాంబాబు, ముత్యాల రాంబాబు, నడుంపల్లి శ్యామ్, సుబ్బరాజు, కొప్పునీడి ఏసు,కుక్కల రవి,జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు జనసైనికులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై ఘర్జించిన గీత కార్మికులు





- మీరు ఇచ్చిన హామీలు నమ్మాం - రోడ్డున పడ్డాం
- మా తలరాతలు మారుస్తారని ఓట్లువేస్తే మా బ్రతుకులు నాశనం చేశారు
- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ డిమాండ్

**భీమవరం,మేజర్‌న్యూస్ :** స్వదేశీ, విదేశీ మద్యం కార్పొరేట్ కంపెనీల లాభాలకోసం,ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలు కోసం మద్యంతో గ్రామాలు ముంచేస్తూ గీత కార్మికుల పొట్టలు కొడుతుంటే చూస్తూ ఊరుకోబోమని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి హెచ్చరించారు. గురువారం భీమవరంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది గీత కార్మికులు ఎక్సైజు శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. తొలుత పాత బస్టాండు నుంచి మెయిన్ రోడ్డు, రాముస్వీట్స్ మీదుగా ఎక్సైజు శాఖ కార్యాలయానికి చేరుకుని "అక్రమ బెల్టు షాపులను రద్దు చెయ్యాలని, ఉపాధి కోల్పోయిన గీత కుటుంబాలను ఆదుకోవాలని" పెద్దఎత్తున నినాదాలు హోరెత్తించారు. అనంతరం జరిగిన సభకు ఆ సంఘం జిల్లా ఉ పాధ్యక్షులు కడలి పాండు అధ్యక్షత వహించారు.అనంతరం ఎక్సైజు సిఐ బి.బలరామరాజుకి వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ అక్రమ బెల్ట్ షాపులపై ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రులు ఇచ్చిన మాట ఎందుకు అమలు చేయడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత అనేది వృత్తి, మద్యం కోట్లతో చేసే పెద్ద వ్యాపారం. పాలకుల ప్రయోజనాల కోసం లక్షలాదిమంది ప్రాణాలతో చెలగాటం మంచిది కాదన్నారు. తెలుగుదేశం కూటమి పాలనలో గీత కార్మికులు బ్రతకలేని పరిస్థితి కల్పిస్తున్నారన్నారు. స్పిరిట్తో తయారు చేసే కల్తీ మద్యం, ఇతర ప్రాంతాల నుండి వస్తున్న అక్రమ మద్యం, దొంగ వ్యాపారంతో గ్రామాలను ముంచేయుట వల్ల కల్లు అమ్మకాలులేక, కుటుంబాలు గడవక గీత కార్మిక కుటుంబాలు విలవిల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గీత బ్రతుకులు బాగుంటాయని నమ్మి ఓట్లు వేసిన గీత కార్మికులను మోసం చేసారన్నారు. గీతకార్మికులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. గీతన్న భరోసా ద్వారా సంవత్సరానికి 25వేల చొప్పున ఇవ్వాలన్నారు. వృత్తిలో చనిపోయిన వారి కుటుంబానికి 5 లక్షలు, శాశ్వత వికలాంగులకు 10 లక్షలు,తాత్కాలిక వికలాంగులకు లక్ష రూపాయలు ఎక్స్రేషియా ప్రభుత్వం బాధ్యతగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొక్కా చంటి, మామిడిశెట్టి నాగభూషణం, సహాయ కార్యదర్శులు దాసరి సూరిబాబు,బొంతు శ్రీనివాస్, కాగిత రాధాకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, తుంగా సాయిబాబు,యిర్రింకి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# పెనుగొండ భాష్యంలో గురువులకు వందనం

**పెనుగొండ,మేజర్ న్యూస్:** స్థానిక కంబాల వారి వీధిలో గల భాష్యం పాఠశాలలో గురువారం నాడు విద్యార్థులంతా ఒకరోజు ముందుగానే "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను" ఎంతో ఆనందంగా జరుపుకున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్వి అప్పారావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా ఉపాధ్యాయలోకానికి ఆదర్శప్రాయుడు, భారతదేశం గర్వించదగిన రాజకీయవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులంతా రాధాకృష్ణన్ జీవిత విశేషాలను పంచుకొని, తమ ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వేషధారణలో అలరించి, తమ ప్రియతమ ఉపాధ్యాయులను అనుకరిస్తూ, ఉపాధ్యాయులకు వారి బాల్యాన్ని గుర్తు చేస్తూ, ఆడుతూ పాడుతూ అలరించి, తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా "గురువు" అనే మానవహారంగా ఏర్పడి తమ గురువులపై తమకున్న ఎనలేని అభిమానాన్ని చాటుకున్నారు. ప్రిన్సిపల్ ఎన్ వి అప్పారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, అది ఎందరో విద్యార్థుల భవితలను తీర్చిదిద్దే



మహాయజ్ఞం అని అన్నారు.ఉపాధ్యాయులను ఉద్దేశించి, ఉపాధ్యాయ వృత్తి అనేది ఎంతో పవిత్రమైనదని దానిని మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా పిల్లల అభివృద్ధికి కృషి చేయాలని గుర్తు చేశారు. అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలను పంచారు. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్చార్జ్ ఏ శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ శ్రీమతి రాణి రోజాజీ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్తను కృత్రిమ ఎరువుగా మార్చుకోవాలి : కమిషనర్ అంజయ్య

**నరసాపురం, మేజర్ న్యూస్ :** పురపాలక సంఘమునకు సంబందించి 15వ వార్డులోని గోదావరి గట్టు ప్రక్కన గల బరియల్ గ్రౌండ్ సమీపన ఉన్న డంపింగ్ యార్డు విషయమై ఓసూరి దేవేంద్ర ఫణికర్, నరసాపురం వారు చెత్తను అక్కడ వేయరాదని దావా వేసియున్నారు. ఈ దావా పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెత్త వేయరాదని ఉత్తర్వులు జారీచేసియున్నారు.

ఈ విషయాన్నిపట్టణ ప్రజలందరూ గమనించగలరని ఎవరు చెత్తని వారే కృత్రిమ ఎరువుగా మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ప్రజలను కోరారు. గతంలో డంపింగ్ యార్డు కొరకు వేములదీవి గ్రామంలో 2014వ సంవత్సరంలో 12వ ఆర్థిక సంఘ నిధుల నుండి రూ.26,25,000 లకు రెవెన్యూ డిపార్ట్మెంట్ వారి ద్వారా ఐదు ఎకరాలు కొనుగోలు చేయుట జరిగిందని, కానీ అక్కడ ప్రజలు ఆ ప్రదేశము నందు చెత్త వేయరాదని తీవ్ర అభ్యంతరములు తెలిపియు న్నారని కమిషనర్ తెలిపారు.



అనంతరం రుస్తుంబాద గ్రామం నందు నాలుగు ఎకరాల 20 సెంట్లు భూమిని రూ.3,45,68వేలకు రెవెన్యూ డిపార్ట్మెంట్ వారి ద్వారా కొనుగోలు చేయుట జరిగినది. కానీ అక్కడ ప్రజలు ఆ ప్రదేశము నందు చెత్త వేయరాదని తీవ్ర అభ్యంతరములు తెలిపియున్నారని ఆయన వివరించారు.

ప్రస్తుతం కొనుగోలు చేసినరెండు ప్రదేశములలో చెత్త వేయుటకు ఆయా గ్రామస్తులు అభ్యంతరములు తెలిపి ఉన్నందున, నరసాపురం పట్టణ శివారులో గల 15వ వార్డు గోదావరి గట్టుప్రక్కన గల బరియల్ గ్రౌండ్ సమీపన ఉన్న డంపింగ్ యార్డు నందు చెత్తను వేయుట జరుగుచున్నది. కానీ ఇప్పుడు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఆదేశములు మేరకు అక్కడ చెత్త వేయుటకు వీలుపడదు. కావున పట్టణ ప్రజలు ఈ విషయాలను గమనించి చెత్తను కృత్రిమ ఎరువుగా మార్చుకుని అధికారులకు సహకరించాలని కమిషనర్ ఎం అంజయ్య కోరారు.

# రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్ట్‌కు గ్రీన్ సిగ్నల్

- వెల్లడించిన కేంద్ర మంత్రి వర్మ ,ఎమ్మెల్యే రాధాకృష్ణ





**అత్తిలి,మేజర్ న్యూస్ :** అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుకుంటున్న ప్రజలకు వారి కోరిక తీరబోతోందని కేంద్ర సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పూరి-తిరుపతి రైలుతోపాటు సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టు పున:ప్రారంభం నేపథ్యంలో గురువారం అత్తిలిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడానికి తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముందు వరుసలో ఉంటారని అన్నారు.ఇందుకు సంబంధించి అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టు కోరుతూ ఎన్నో పర్యాయాలు వినతి పత్రాలు అందజేశారని గుర్తు చేశారు.ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక స్టేషన్‌లో హాల్టు ఇవ్వాలంటే సాధారణమైన విషయం కాదన్నారు.అత్తిలి ప్రాంతం వ్యాపారసంబంధమైన ప్రాంతం కావడంతో ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ అత్తిలి పరిసర ప్రాంతాల్లో దాదాపు 40 గ్రామాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టు ఇవ్వడానికి కృషి చేసిన మంత్రి శ్రీనివాస వర్మకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రాధాకృష్ణలను స్థానికులు ఘనంగా సత్కరించారు.

# నిత్యాన్నదాన ట్రస్ట్‌కు 1లక్షల16వేలు విరాళం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయానికి భీమవరం వాస్తవ్యులు గడ్డిరాజు సూర్య మణికంఠ రాజు విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ఆఫీసు వద్ద నిత్యా అన్నదాన టెస్టుకు 1లక్షా 16వేల రూపాయలు అందించారు. దేవాలయ ఏఈఓ నటరాజరావు బాండ్ పత్రాలను, స్వామివారి ప్రసాదాలను, అందించి ప్రత్యేక అభినందించారు.

# సాహస యాత్రను పరిశీలించిన అధికారులు





**ఒడిస్సా /నర్సాపురం,మేజర్ న్యూస్ :** ఐఎన్ఎస్ చిలక ఒడిస్సాలో సాహస యాత్ర సైలింగ్ ఎక్స్పెడిషన్ ఈ నెల 10 వరకు సెవెన్ ఆంధ్రా నావెల్ యూనిట్ ఎన్సిసి నర్సాపురం, కాకినాడ గ్రూప్ ఆధ్వర్యంలో ఒరిస్సాలో 10రోజులు జరుగుతుంది.ఈ 10 రోజులు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థి విద్యార్థులు సుమారు 100 మంది పాల్గొంటున్నారు. ఈ సైలింగ్ ఎక్స్పెడిషన్ సుమారు 220 కిలోమీటర్లు సాగుతుందని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ సంజిత్ రౌత్రే తెలియజేశారు.

ఈ సాహస యాత్రను గురువారం కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ నితిన్ అగర్వాల్, ఆడం ఆఫీసర్ అనిల్ మెహరా సందర్శించారు. ఆంధ్రప్రదేశ్,తెలంగాణ ఎన్సీసీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమడోర్ నర్సింగ్ సైలని కూడా సందర్శించి విద్యార్థిని విద్యార్థులకు ఈ సాహస యాత్ర వల్ల కలుగు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కమాండర్ అనిల్ యాదవ్, పిఏ స్టాఫ్ ఆఫీస్ సిబ్బంది పాల్గొంటున్నారు.ఇప్పటివరకు 45 కిలోమీటర్లు సైలింగ్ ఎక్స్పెడిషన్ పూర్తి చేసారు.

# బిజెపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

**- భీమవరం తరలివచ్చి కార్యకర్తల సత్తా చాటాలి**
**- కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పిలుపు**



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** నరేంద్ర మోడీ ప్రభుత్వంలోనే దేశ సర్వతోముఖభివృద్ధి జరుగుతోందని, హామీలు ఖచ్చితంగా అమలుచేసే పార్టీ బిజెపి యేనని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం కిరాణా మర్చంట్ హాల్లో గురువారం జరిగిన బిజెపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ అధ్యక్షతన కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని హామీలను తక్షణమే అమలు చేస్తుందన్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఢిల్లీ ఎర్రకోట నుంచి ప్రధాన నరేంద్ర మోడీ చేసిన ప్రసంగంలో త్వరలో ప్రజలకు దీపావళి కానుక ఇవ్వనన్నట్టు ప్రకటించారని, ఆ మేరకు జి.ఎస్.టిలో మార్పులు చేసి పన్ను రేట్లు గణనీయంగా తగ్గించి సామాన్య పేద ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ధరలు తగ్గింపునకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బిజెపి నూతన అధ్యక్షులు టివిఎన్ మాధవ్ చేపట్టిన 'సారధ్యం' జిల్లా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అందుకు అనుగుణంగా గ్రామగ్రామాల నుంచి కార్యకర్తలు అభిమానులను భీమవరం తీసుకురావాలన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పేదలకు వరాలు ప్రకటించారన్నారు. జీఎస్టీ పన్ను రేట్లు తగ్గించడం ద్వారా నిత్యవసర వస్తువులు ఔషధాలు వ్యవసాయ పరికరాలు వంటి ధరలు తగ్గుతాయని పేర్కొన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ దేశానికి ప్రజలకు మేలు చేసే బిజెపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు త్వరలో భీమవరంలో జరుగునున్న సారధ్యం కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు కార్యకర్తలుఉప్పెనలా తరలి రావాలని కోరారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వం లో దేశం అన్ని రంగాల్లోనూ విశేషాలు అభివృద్ధి సాధిస్తుందన్నారు.బిజెపి జిల్లా పూర్వాధ్యక్షులు నార్నె తాతాజీ,నర్సాపురం పార్లమెంట్ ఇన్చార్జి పేరిచర్ల సుభాష్ రాజు,జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు,జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు నార్నె తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు ప్రసాద్,పార్లమెంట్ ఇంచార్జి పేరిచర్ల శుభాష్ రాజు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర బాలాజీ, కంచుమర్తి నాగేశ్వర రావు, తోట గంగరాజు, ఆర్.పుల్లాజీ, నరిసే సోమేశ్వరరావు, దువ్వా శ్రీనివాస్, సమయమంతుల కాశీ, ఇమ్మంది శ్రీనివాస్, శ్రీనివాస్, కోట రాంబాబు, పెదపోలు వీర రాఘవులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర బాలాజీ, గట్టిం సింధు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయాలి : న్యాయమూర్తి వాసంతి



నర్సాపురం,మేజర్ న్యూస్: ఈ నెల 13వ తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం అందించుటలో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలని, 10వ అదనపు జిల్లా జడ్జి,చైర్ పర్సన్ ఎ.వాసంతి కోరారు. గురువారం స్థానిక కోర్టు హాల్ నందు న్యాయవాదులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.న్యాయవాదులు కూడా తమ తమ కక్షిదారులకు లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశంను వివరించాలన్నారు.రోజూ కోర్ట్ ఆవరణలో జరుగుచున్న మధ్యవర్తిత్వం ను ఉపయోగించుకుని కక్షిదారులకు సమన్యాయం అందించుటకు న్యాయవాదులు పూర్తి సహకారాన్ని అందించాలని న్యాయవాదులకు సూచనలిచ్చారు.
క్రిమినల్ కేసులతో బాటు సివిల్ కేసులు కూడా ఎక్కువగా రాజీ అయ్యేలా తమ వంతు కృషి చేయాలన్నారు. ఫైనాన్స్ కేసులకు సంబంధించిన ఎక్స్యూషన్ పిటిషన్ కేసులు కూడా ప్రీ లోక్ అదాలత్ ముందు రాజీ చేయడానికి అందరూ సహకరించి,రాజీ కేసుల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండేలా అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు,ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూ.డివిజన్) ఆర్.వరలక్ష్మి,అదనపు సివిల్ జడ్జి (జూ.డివిజన్) ఎస్.రాజ్య లక్ష్మి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.విశ్వేశ్వరరావు ట్రెజరర్ పి.శ్రీనివాసరావు,సీనియర్ జూనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలపై జిఎస్టీ తగ్గించడం పట్ల హర్షం



**టి.నరసాపురం,మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై జిఎస్టీ తగ్గించడం పట్ల నవ భారత్ ఆయిల్ ఫామ్ జంగారెడ్డిగూడెం జోన్ రైతు సంఘం అధ్యక్షులు, మక్కినవారి గూడెం సొసైటీ చైర్ పర్సన్ ఆచంట సూర్య నారాయణ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ట్రాక్టర్ టైర్లు విడి భాగాలు,డ్రిప్ ఇరిగేషన్,స్పింక్లర్లు,నిత్యావసర వస్తువులపై 18శాతం నుంచి 5శాతం తగ్గించడం,ఆరోగ్యం, భీమా పాలసీలపై జిఎస్టీ పూర్తిగా తొలగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిఎస్టీ తగ్గించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్‌లకు జిఎస్టీ తగ్గించడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఎంపి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ లకు రైతుల తరుపున ఆచంట సూర్యనారాయణ, ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మద్దిపాటి ప్రభ శేఖర్,ఆచంట చక్రధర రావు,మిద్దె రాంబాబు, చవ్వల నాగరాజు, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# హరిజన,గిరిజన గ్రామాలలో హిందూ ధార్మిక చైతన్యానికి కృషి

**- ఎస్ ఎస్ ఎఫ్ జిల్లా కన్వీనర్ తిప్పాబోట్ల రామకృష్ణ**



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** హరిజన గిరిజన గ్రామాలలో హిందూ ధార్మిక చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయనున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ తిప్పా బోట్ల రామకృష్ణ పేర్కొన్నారు. రాబోయే దసరా ఉత్సవాలలో సత్సంగాలు, భజనలు ద్వారా హిందూ ధార్మిక చైతన్యానికి సమరసత సేవా ఫౌండేషన్ కృషి చేస్తుందని తిప్పాబొట్ల రామకృష్ణ అన్నారు.గురువారం జీలుగుమిల్లిలోని రామన్నపాలెం శ్రీ కోదండ రామాలయం నందు జీలుగుమిల్లి మండలం ఎస్ఎస్ఎఫ్ సహా కన్వీనర్ కొత్తూరి మోహన్ రావు అధ్యక్షతన ఎస్ ఎస్ ఎఫ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీవీ రామకృష్ణ విచ్చేసి మాట్లాడినారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాగం సత్య నారాయణ,బొంతు రామకృష్ణ, తెల్లం వెంకటేశ్వరరావు, ఊక సూర్యచంద్రరావు, పశువులేటి కృష్ణ మోహన్, కరిపోతుల బేబీ, కప్పల నిర్మల,టి నిర్మల,కప్పల వెంకటేశ్వరరావు,రేపాక గోపాలం, కక్కిరాల మురళి,జంగారెడ్డిగూడెం ఎస్ ఎస్ ఎఫ్ ధర్మ ప్రచారక్ మంగళగిరి సతీష్,తదితరులు పాల్గొన్నారు.

## ఆలమూరులో ఎరువుల షాప్ పై విజిలెన్స్ దాడి



పెనుమంట్ర,మేజర్‌న్యూస్ : విజిలెన్స్ , ఎన్ఫోర్స్మెంట్ డిజి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల ప్రకారం పిమహేష్, రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారి, ఏలూరు వారికి రాబడిన సమాచారం మేరకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో విజిలెన్సు, రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా వివిధ ప్రాంతాలలో ఏక కాలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఎరువులు షాపులు ఆకస్మిక తనిఖీ చేశారు, తనిఖీ లో భాగంగా పెనుమంట్ర మండలం, ఆలమూరు లో (3) మేస్సేర్స్ ధనశ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ ల నందు తనిఖీ చేయగా మూడు షాపుల నందు రు. 2.35 లక్షలు విలువ కలిగిన 7.5 మెట్రిక్ టన్నుల ఎరువులు వ్యత్యాసము గుర్తించి వాటిని సీజ్ చేసి షాపు యజమానుల పై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6(ఏ) కేసులు నమోదు చేయడమైనది. ఈ తనిఖీలలో విజిలెన్సు డి ఎస్ పి సింగులూరి వెంకటేశ్వర రావు, విజిలెన్సు ఇన్స్పెక్టర్ పి శివరామ కృష్ణ, విజిలెన్సు ఎఓ ఏ ఓ జి.మీరయ్య, విజిలెన్సు ఎస్సై సిహెచ్ రంజిత్ కుమార్, కే సీతారాము, పెనుమంట్ర మండల వ్యవసాయ శాఖాధికారి, క్వాలిటీ కంట్రోల్ అధికారి వై. రాఘవేంద్రరావు, బి దేవి స్వరూప రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జీలుగుమిల్లిలో యోగ్నేష్ హొటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి




**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** జీలుగుమిల్లి లోని అంబేద్కర్ సెంటర్లో నూతన యోగ్నేష్ హొటల్ ను గురువారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, సీనియర్ నాయకులు సరిపల్లి సత్యనారాయణ రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి కోసం వ్యాపారాలను స్థాపించడం శుభ పరిణామం అన్నారు. కొత్తగా యోగ్నేష్ హొటల్ ప్రారంభించిన యజమానులకు వ్యాపారం అభివృద్ధి చెందాలని దీవించారు. వ్యాపారాలు చేయడం ద్వారా స్వయం ఉపాధితో పాటు మరి కొంతమందికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలరాజు మొదటి పార్సెల్ తీసుకొని భోజనం చేసి హొటల్ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ ప్రారంభ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులే రాము,టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, కక్కిరాల రాము, కోరుకొండ సూరిబాబు, కక్కిరాల చక్రి, పొడపాటి దుర్గారావు,ఉలవల ముత్యం, నారగాని బుజ్జి, ఉలవల వెంకటేశ్వరరావు,బలగాని వెంకటేశ్వరరావు ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

**డాక్టర్ ఎం.నవ్య జీవన్**



పాలకొల్లు,మేజర్ న్యూస్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ ఎం నవ్య జీవన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ నందు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ కు దూరంగా ఉండాలని. కంటి సమస్యలు రాకుండా విటమిన్ ఏ ఎక్కువగా ఉన్న పాలు. గుడ్డు. క్యారెట్. ఆకుకూరలు తరచుగా తీసుకోవడం వల్ల కంటి సమస్యల నుంచి రక్షింపబడతారని తెలియజేశారు.

కళ్ళజోళ్ళు అవసరమైన వారిని గుర్తించి కళ్ళజోళ్ళు ఇప్పించే ఏర్పాటు చేయడం జరుగు తుందని. ఇంకా కంటి సమస్యలు ఉంటే కంటికి సంబంధించిన డాక్టర్లచే వైద్య పరీక్షలు చేయించి వైద్య సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు.హై స్కూలు ప్రధానోపాధ్యా యులు కె.రాజశేఖర్.ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జి జనార్దన్‌రావు. పిహెచ్ఎన్‌పి.ఎలిజిబెత్.సూపర్వైజర్ ఎస్‌కె అమలేశ్వర రావు. వంగ సోమరాజు. ఆశా కార్యకర్తలు. వెంకటలక్ష్మి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన కోకో మొక్కలతో అధిక దిగుబడులు





పెదవేగి,మేజర్ న్యూస్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కోకో పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫార్మర్ డైరెక్టర్ డాక్టర్ పి చౌడప్ప పేర్కొన్నారు. గురువారం పెదవేగి మండలంలోని పామాయిల్ తోటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోకో పంట సాగు విస్తీర్ణం పెంచడానికి, రైతులకు అధిక ఆదాయం రావడానికి తీసుకోవలసిన చర్యలు తదితర వాటిపై ఈ సందర్శన ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. రైతుల పామాయిల్ తోటలను ఆయన సందర్శించి పంట దిగుబడిలు, విస్తీర్ణత శాతం తదితర వాటిపై రైతుల వద్ద నుండి సమాచారం సేకరించారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామ్మోహన్ మాట్లాడుతూ నాణ్యమైన కోకో మొక్కలతో అధిక దిగుబడులను సాధించడానికి తీసుకోవలసిన చర్యలపై రైతుల వద్ద నుండి సమాచారాన్ని సేకరించి, విస్తీర్ణ శాతాన్ని పెంచడానికి ఈ సందర్శన ఉపయోగపడు తుందని ఆయన అన్నారు.

జిల్లాలో 36,500 ఎకరాలు విస్తీర్ణంలో కోకో పంట సాగు అవుతుందని,కోకో సాగులో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్డాక్టర్ మునిరెడ్డి,విజయరాయి ఉద్యాన శాఖ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుశీల,డాక్టర్ పి మాధవి లత,ఏలూరు ఉద్యానశాఖ అధికారి సంతోష్ మొండలిజ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర రావు,రైతులు ఇంజనీర్ ప్రసాద్, ఆలపాటి సత్యనారా యణ,ఉండవల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడే సమాజానికి దిక్సూచి





**నూజివీడు,మేజర్ న్యూస్ :** నూజివీడు మండలం మద్దాయి కుంట గ్రామం హై స్కూల్ నందు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు ప్రధాన ఉపాధ్యాయులు దారపు రెడ్డి భాస్కరరావు భారతరత్న, భారత మొదటి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు ఉపాధ్యాయ లోకానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడని, నేటి తరం ప్రతి ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు పి యశ్విత, డి దేవి, స్నేహ,సత్య ప్రణీత్, భరత్ తదితరులు ఉపాధ్యాయులు వేషధారణలో స్వయం పరిపాలన తో ఆయా సబ్జెక్టులు పాఠ్యాంశాలు బోధించారు

ఈ కార్యక్రమానికి ఎస్ఎంసి చైర్మన్ ఎర్రబాల శివరామకృష్ణ,మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు యువరాజు,ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నవ్య, శివ నాగరాజు టిటి భాస్కర్ జాన్సన్ తదితరులు పాల్గొని విద్యార్థుల సమక్షంలో ప్రధానోపాధ్యాయుల సేవలను కొనియాడి పాఠశాలను అభివృద్ధి పథంలో నడుపుతున్నారని భాస్కర్ రావుని శాలువాతో ఘనంగా సత్కరించారు.

## సిఎస్ వీడియో సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి



ఏలూరు,మేజర్ న్యూస్ : ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ఎంఐ ట్యాంకులు అండ్ గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్,యూరియా లభ్యత అండ్ ధర నిర్ణయం, పిఎం కుసుమ్, సిబిజీ మొక్కలు,సౌర/పవన ప్రాజెక్టులకు సంబంధించిన భూ సమస్యలు, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఏలూరు నుంచి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1513 మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి మరమ్మత్తులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణాలపై ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో భూగర్భ జలాలకు సంబంధించి జిల్లా భూగర్భ జలాలవివరాలతో కూడిన సెప్టెంబర్ నెల బులిటెన్ రూపొందిస్తున్నా మన్నారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,ఇరిగేషన్ శాఖ ఎస్ ఈ దేవ ప్రకాష్, వ్యవసాయశాఖాధికారి హబీబ్ భాషా,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 6న వామపక్షాల నిరసన జయప్రదం చేయండి : వామపక్షాల పిలుపు




**ఏలూరు,మేజర్ న్యూస్ :** భారతీయ సరుకుల దిగుమతులపై ట్రంప్ సర్కార్ సుంకాన్ని 50 శాతానికి పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 6వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో జరిగే నిరసన జయప్రదం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నందు వామపక్షాల సమావేశం సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావులు మాట్లాడుతూ భారతీయ సరుకులపై 50 శాతం దిగుమతి సుంకాన్ని విధించడం వలన మన దేశీయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని షరతులు పెడుతుందని విమర్శించారు.

దేశ ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేస్తూ అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఈ నెల 6న నిరసన కార్యక్రమాలు జరపాలని,ఈ నిరసనలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి. ఆరో తేదీ శనివారం ఉదయం 10:30 గంటలకు ఏలూరు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. వామపక్షాల సమావేశంలో సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు,సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్ పాల్గొన్నారు.

## 52 మంది మూగ, చెవిటి విద్యార్థులకు బియ్యం పంపిణీ



పెదవేగి,మేజర్ న్యూస్ : పెదవేగి మండలం ప్రకాష్ నగర్ జానంపేట డి సాలేస్ స్పెషల్ స్కూల్‌లో చదువు తున్న మూగ, చెవిటి 52 మంది విద్యార్థిని విద్యార్థులకు రెవరెండ్ ఫాదర్ నెల్లి జార్జి , ఉపాధ్యాయులు తేర ప్రసాద్, బంటు మోహన రావు, కాటం గస్పర్, తేర దేవ సుందరం, ఫాదర్ అన్నదమ్ములు వీరందరి ఆర్థిక సహాయంతో 25 వేల రూపాయలు విలువైన 30 బస్తాల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోడి సాలేస్ స్పెషల్ స్కూల్ ప్రిన్సిపాల్, సిస్టర్ సుపీరియర్ సిస్టర్స్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు లైఫ్ జాకెట్ల ఉపయోగించి పడవల్లో స్కూల్‌కు తరలింపు



**కుక్కునూరు,వేలేరుపాడు,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివకిషోర్,పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశాలపై కుక్కునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, వేలేరుపాడు ఎస్ఐ నవీన్ వారి సిబ్బంది వేలేరుపాడు మండలం గోదావరి నది పరివాహక మారుమూరు ప్రాంతాలలో నివసిస్తున్న విద్యార్థిని విద్యార్థులను పడవల్లో లైఫ్ జాకెట్ల ఉపయోగించి ఎటువంటి ప్రమాదాలు లేకుండా స్కూళ్లకు తరలించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాలైన కారుటూరు,బొల్లపల్లి వంటి మారుమూల గ్రామాలలో నివసించే విద్యార్థులు వరదల కారణంగా పాఠశాలలకు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నా సమస్యను గుర్తించిన పోలీసు అధికారులు విద్యార్థుల భద్రతను తమ బాధ్యతగా తీసుకున్నారు.సాధారణంగా శాంతి భద్రతలను కాపాడే పోలీసులు,క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు అండగా నిలవడం సమాజానికి స్ఫూర్తి నిస్తుంది. వేలేరుపాడు పోలీసుల సేవా సామాజిక బాధ్యత,మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇలాంటి చర్యలు సమాజంలో పోలీసుల పట్ల గౌరవం,విశ్వాసాన్ని పెంచుతాయి. ఈ కార్యక్రమములో పాల్గొన్న పోలీస్ సిబ్బందినీ అభినందించారు.

## గ్రామపంచాయతీల పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి

**పెదవేగి,మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీలు పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి అనురాధ తెలిపారు. గురువారం పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు.ఈసందర్భంగా సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి ఆమెమాట్లాడుతూ లక్ష్మీపురం గ్రామపంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె అన్నారు. అలాగే స్వర్ణ పంచాయతీ అనే కార్యక్రమం ద్వారా పంచాయితీ కి చెల్లించాల్సిన బిల్లులు అన్ని ఆన్లైన్ ద్వారానే జరగాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేక కనకరాజు,ఈఓ పిఆర్‌డి షరీఫ్, కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డ్ పంపిణి



**కైకలూరు,మేజర్ న్యూస్ :** కైకలూరు మండలం నత్త గుళ్ళపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన క్యూ.ఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులను లబ్దిదారులకు కూటమి నాయకులు ఎన్. కృష్ణ నంద రావు అందించారు. ఈ సందర్భంగా కృష్ణా నందన రావు మాట్లాడుతూ అదునాతన టెక్నాలజీతో క్యూ.ఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డులు రావటం చాలా సంతోషం.స్మార్ట్ రేషన్ కార్డులపై నాయకుల ఫొటోస్ లేకుండా ఆర్బటాలు లేకుండా యజమాని ఫోటో సభ్యుల పేర్లతో చాలా మంచిగా డిజైన్ చేసారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జి.చందు,ఎన్. వంశి, ఎం థామస్, గ్రామ ఉపసర్పంచ్ ఏడుకొండలు,గ్రామ పెద్దలు కిరణ్ కుమార్, మరియు విఆర్ఓ,వీఆర్ఏ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో రైతాంగానికి ప్రయోజనం

**– శ్లాబుల్లో మార్పుల పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జీఎస్టీ శ్లాబుల్లో కేంద్రం తీసుకొచ్చిన మార్పుల పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. నిన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల విధానాన్ని రెండు శ్లాబులకు తీసుకురావడంతో పాటు, బీడీ ఆకులపై, పలు వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించారు. ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు, విడిభాగాలు, స్పెసిఫైడ్ బయో పెస్టిసైడ్స్, మైక్రో న్యూట్రియంట్స్, స్ప్రింక్లర్లు సహా డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ, ఇతర వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ 5 శాతానికి తగ్గించడంతో రైతన్నకి లబ్ధి కలుగుతుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. వ్యవసాయ పనిముట్ల, యంత్రాల, కొన్ని రకాల పురుగుమందుల ధరలు తగ్గి రైతాంగానికి మేలు చేకూరుతుందని ఎంపీ అన్నారు.

– రైతన్నపై భారం తగ్గించేందుకు ఎంపీ కృషి –

వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగు ఖర్చు పెరిగిపోవటం,పొగాకు కొనుగోళ్లు,పామాయిల్ ధరలు, కోకో రైతుల సమస్యలపై అనేకమార్లు తాను కేంద్ర వ్యవసాయ,వాణిజ్య శాఖల మంత్రులు,అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు.తమ విజ్ఞప్తులను పరిశీలించి ముఖ్యంగా బయో పెస్టిసైడ్స్, వ్యవసాయ పరికరాలు వంటివాటిపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ వ్యవసాయ రంగానికి మేలు చేకూర్చుతూ నిర్ణయం తీసుకున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి, జీఎస్టీ కౌన్సిల్ కి, ప్రధాని నరేంద్ర మోదీకి, ఏలూరు రైతాంగం తరపున ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# మురుగులేని పల్లెలుగా తీర్చిదిద్దడమే కూటమి లక్ష్యం

**– డ్రైన్ల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** మురుగులేని పల్లెలు నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో పెద్ద తాడేపల్లి, చిన్న తాడేపల్లి,వెంకట్రావు పాలెం, అప్పారావుపేట అమృతపురం, లింగారాయుడు గూడెం, ఆరుగొలను, కుంచనపల్లి, గ్రామాల్లో మురుగు నీటి సమస్య పరిష్కరించే మ్యాజిక్ డ్రైన్ల పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయనతోపాటు జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ పాల్గొన్నారు. పల్లెలను పర్యాటక ప్రాంతాల మాదిరి సుందరంగా తీర్చిదిద్దడమే కూటమి ముందున్న ధ్యేయమని ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో నియోజక అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకుంటూ దానిలో భాగంగా మురుగు లేని పల్లెలుగా మన తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలని. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్,మంత్రి లోకేష్, తక్కువ ఖర్చుతో కూడిన మ్యాజిక్ డ్రైన్‌లను మొట్ట మొదటిసారిగా ఈ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగింది. ఒకప్పుడు డ్రైనేజీలు నిర్మించాలంటే ఎక్కువ ఖర్చుతో కట్టాల్సి వచ్చేది గ్రామాల్లో ఎన్‌ఆర్‌జిఎస్ నిధులతో మ్యాజిక్ డ్రైన్లను తక్కువ ఖర్చుతో కట్టడానికి మన కూటమి ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో జడ్పి నిధుల నుంచి కూడా డ్రైనేజీలను కట్టడం జరుగుతుంది. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మన జడ్పీ నుంచి కూడా ఆయన గ్రాంట్లు తెచ్చుకొని ఈ సంవత్సరకాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడపా ప్రసాద్,పరిమి రవికుమార్,పుల్లా బాబి, పరిమి సురేష్, పసుమర్తి సత్యనారాయణ, గోవిందు, పీతల బుచ్చిబాబు, పిల్లా రాంబాబు, వాడపల్లి సుబ్బరాజు,అధికారులతో పాటు కూటమి సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల అక్రమ నిల్వలు, తరలింపు, బ్లాక్ మార్కెటింగ్‌పై కేసులు

**– ఎరువుల కొరత లేదు**
**– ఆందోళన చెందవద్దని రైతులకు అవగాహన**
**– అధికారులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో యూరియాను నిరంతరం రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం సరఫరా చేస్తుందనే విషయాన్నీ క్షేత్రస్థాయి లో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు స్పష్టంగా అవగాహన కలిగిం చాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఎరువుల లభ్యత, సరఫరాలపై వ్యవసాయాధికారులతో గురువారం కలెక్టరేట్ నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా రైతులు రబీ అవసరాలకు కూడా ఇప్పటినుండే యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో యూరియాను అక్రమంగా నిల్వ చేసినా,దారి మళ్లించినా, అధిక ధరలకు అమ్మినా అట్టి డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. వ్యవసాయాధికారులు గ్రామ స్థాయి అధికారుల వరకు అందరూ రైతుల యూరియా అవసరాలను గుర్తించి దఫా, దఫాలుగా వారికి సరఫరా చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పుడూ సంవత్సరం పొడుగునా ఎరువులు నిల్వాలు సరఫరా అవుతాయని చెప్పారు. యూరియా తాడేపల్లిగూడెం రేక్ పాయింట్ నుండి రేక్ ఆఫీసర్ వారు జాగ్రత్తగా మండలాలకు, గ్రామాలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా సరఫరాపై తప్పుడు వదంతులు వ్యాప్తి చేసిన వారిపట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులు వదంతులను నమ్మవద్దని, ప్రభుత్వం రైతులకు యూరియాను అందుబాటులో ఉంచిన వివరాలను రైతులకు వ్యవసాయాధికారులు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో రెండు వేల టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం నుండి 500 టన్నుల యూరియా ఏలూరు జిల్లాకు కేటాయించడం జరిగిందని, అదికూడా రేపు సాయంత్రం డీలర్లకు లారీల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులందరికీ ఎరువులు అవసరమైన ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని, మోతాదుకు మించిన ఎరువులు రైతులు వినియోగించకుండా,ఎరువుల అధిక వినియోగం వలన కలిగే అనర్ధాలను రైతులకు తెలియ జేయాలన్నారు.

జిల్లాలో అవసరమైన ఎరువులు నిల్వలు ఉన్నాయని,ఎటువంటి ఆందోళన చెందవద్దని రైతులకు అవగాహన కలిగించాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు.కల్తీ ఎరువుల బారిన రైతులు పడకుండా గుర్తింపు పొందిన దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేసి బిల్లులను తప్పనిసరిగా అడిగి తీసుకొవాలని రైతులకు తెలియజేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా,మండల, గ్రామ స్థాయి వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## మా అమ్మాయి పెళ్ళికి వచ్చి ఆశీర్వదించండి

**– సీఎం చంద్రబాబు,మంత్రి లోకేష్‌కు మంత్రి 'నిమ్మల' ఆహ్వానం**





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** ఉండవల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలసి ఈనెల 24న పాలకొల్లులో జరిగే నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ వివాహానాకి హాజరు కావలసిందిగా ఆహ్వానించారు. అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వివాహ పత్రికను అందజేశారు.

## 3.460 కేజీల గంజాయి పట్టివేత -ఆరుగురు అరెస్టు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు, ఏలూరు సబ్ డివిజన్ డి.ఎస్.పి. పర్యవేక్షణలో, ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సూచనలతో ఎస్సై పి రాంబాబు తమ సిబ్బందితో కలిసి గంజాయి వ్యాపారులపై ప్రత్యేక దాడి నిర్వహించారు. 3వ తేదీ మధ్యాహ్నం సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు, మినీ బైపాస్ రోడ్డులోని గ్రాండ్ కృష్ణ ఫంక్షన్ హాల్ జంక్షన్ వద్ద ఆరుగురు వ్యక్తులు గంజాయి పంచుకుంటూ, విక్రయానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈ సమాచారంతో పోలీసులు వెంటనే దాడి చేసి, నిందితులు విష్ణుశెట్టి సత్యా రూప్ కుమార్ ఏ సతీష్,కొమ్మిన మణికంఠ ఏ సర్దార్ పాండా,తమ్మిశెట్టి రామ్ చరణ్,అల్లంపల్లి రాజేష్ ,ఇద్దరు మైనర్లను లను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి మొత్తం 3.460 కేజీల గంజాయి,రెండు మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. దీనిపై 3 టౌన్ పోలీసు స్టేషన్ సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ ,ఎన్ డి ఆర్ ఎఫ్ ఆధ్వర్యంలో విపత్తుల నిర్వహణపై అవగాహన




**పెనుగొండ,మేజర్ న్యూస్:** ప్రకృతి వైపరీత్యాలు సహజసిద్ధంగా సంక్రమిస్తాయని వాతావరణ మార్పులు వల్ల ,మానవ కార్యకలాపాల వల్ల ఈ వైపరీత్యాలు సంభవిస్తాయని ఎన్ డి ఆర్ ఎఫ్ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎస్వి కె పి డాక్టర్ కే.ఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వైపరీత్యాలు ,నిర్వహణ సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.వి అప్పారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహి ంచారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు హఠాత్తుగా సంభవిస్తాయని వాటిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ,విద్యార్థిని విద్యార్థులు ఈ సదస్సులో అవగాహన చేసుకుని సమయం వచ్చినప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదిమంది తో కూడిన ఎన్ డి ఆర్ ఎఫ్(నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) టీము ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లకు పలు విపత్తులైన వరదలు, సి.పి.ఆర్, గ్యాస్ ద్వారా అగ్ని ప్రమాదాలు అనే వాటి పై కొన్ని కృత్యాలు చేసి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్ డి ఆర్ ఎఫ్ ఇన్స్పెక్టర్ అరుణోదయ దివేది మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెపత్తు నిర్వహణ సంస్థ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తుందని అనేకమందికి అవగాహన కల్పించే క్రమంలో కృషి చేస్తుందని అని రాష్ట్రాలలో విపత్తుల నిర్వహణ కార్యక్రమాలు అనేక టీమ్స్ ద్వారా నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఎన్.ఎస్.ఎస్ అధికారులు టి.దివాకర్, ఆర్.ఎన్.శ్రీనివాస్ ,పీ.మీరయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.